# సచ్చిదానందమనేది మానవుని స్వభావమే!

విశ్వచింతన చేయు విజ్ఞానజీవుడు
విష్ణుచింత జేయు విబుధవరుడు
ఒకడు విశ్వము నొందు నొకడు విష్ణువు పొందు
వినుడు భారతీయ వీరసుతుడ.

ప్రేమస్వరూపులారా!

మానవుడు స్వయంగా సత్ చిత్ ఆనందస్వరూపుడై ఉండినప్పటికిని అట్టి సత్యాన్ని గుర్తించుకొనలేక సచ్చిదానందము నిమిత్తమై బాహ్యప్రపంచమునందు, ప్రాకృతమైన ఈ జగత్తునందు, భౌతికమైన ఈ భక్తియందు సత్ చిత్ ఆనందాన్ని అన్వేషిస్తున్నాడు. తనయొక్క తత్వము తాను గుర్తించుకొనలేక విశ్వతత్త్వమునే భావించుచు, అనుభవించుచూ ఆనందించుచూ తనయొక్క స్వరూపాన్ని తాను విస్మరిస్తూ వస్తున్నాడు. ఈ విధంగా విశ్వాన్ని విశ్వసించటానికి అజ్ఞానమే మూలకారణము. ముఖ్యంగా తానే విష్ణుస్వరూపమై ఉండికూడను ప్రాకృతమైన జగత్తును విశ్వసించటం చాలా అమాయకత్వము. ఇలాంటి అజ్ఞానము, అవివేకము రెండింటి ఏకత్వముచేతనే తన తత్వాన్ని విస్మరిస్తున్నాడు. సత్ చిత్ ఆనందములనేవి తనయొక్క స్వభావమే! తన స్వరూపమే! బియ్యమును పొట్టు కప్పివేసినట్లుగా, నీటిని పాచి కప్పినట్లుగా, సూర్యుని మేఘము కప్పినట్లుగా సత్ చిత్ ఆనందమును అజ్ఞానము కప్పిఉంటున్నది.

## మానవుడు తన అజ్ఞానమును తొలగించినప్పుడే సచ్చిదానందమును తెలుసుకుంటాడు

ఈ అజ్ఞానము ఎక్కడనుండి ఆవిర్భవిస్తున్నది? నీటిని కప్పినటువంటి నాచు నీటినుండే పుట్టింది. సూర్యుని కప్పినటువంటి మేఘములు సూర్యునినుండే ఉద్భవించాయి. కానీ, పొట్టును తీసినప్పుడే బియ్యం కనిపిస్తుంది. నాచును పక్కకు నెట్టినప్పుడే నీరు కనిపిస్తుంది.

sri sathyasai vachanamrutam

మేఘములు కదలిపోగానే సూర్యుడు స్వప్రకాశమై ప్రకాశిస్తుంటాడు. మానవుడు తన అజ్ఞానమును తొలగించినప్పుడే సత్ చిత్ ఆనందమును తెలుసుకుంటాడు. ఈ అజ్ఞానమనగా ఏమిటి? అజ్ఞానము వేరు, జ్ఞానము వేరు కాదు. Action and reaction. జ్ఞానమే లేకుండిన అజ్ఞానమే లేదు. జ్ఞానము ఉన్నందువల్లనే అజ్ఞానము ఛాయవలె ఉంటున్నాది. మనము అజ్ఞానమనే ఛాయను అనుసరిస్తున్నామేగానీ సత్యమనే స్వరూపాన్ని అనుసరించటంలేదు. ఈ అజ్ఞానమనే భావములో నీవు ఉండినంతసేపు నీకంటే అధికముగా వేరొకటి ఉంటుండాది, అని భావిస్తున్నావు. దీనికి చక్కని ఉదాహరణము. సూర్యోదయమైంది; నీవు సూర్యునివైపు దృష్టి పెట్టినప్పుడు నీయొక్క ప్రతిబింబము నీకు కనిపించదు. నీవు సూర్యుని వెనుకకు పెట్టి నిలబడినప్పుడు నీకన్నా ముందుగా ప్రతిబింబముంటున్నది. అనగా సత్యమును వెనుకకు పెట్టి నీవు ముందుగా ప్రయాణము చేసినప్పుడు నీకన్నా ప్రతిబింబము ముందుగా ఉంటున్నాది. దానిని నీవు వెనుకకు నెట్టివేయాలి అనుకున్నా, నీకన్నా ముందుకు పోతున్నాది. మనము సత్ చిత్ ఆనందమనే భగవంతుని చింతన చేసినప్పుడు అజ్ఞానమనే ఛాయ మనకు కనిపించదు. కనుకనే ఉపనిషత్తులు 'ఉత్తిష్టత, జాగ్రత' అని చెప్పినాయి. నీవు ఈనాడు సత్యాన్ని విస్మరిస్తున్నావు. అసత్యాన్ని విశ్వసిస్తున్నావు. ఒకడు నిద్రలో కలలు కంటున్నాడు. కలలు కంటున్న సమయంలో అదియే సత్యమని భావిస్తున్నాడు. కలలో తాను ప్రెసిడెంటుగాను, ప్రైమినిష్టరుగాను ఊహించుకుంటున్నాడు. కలలో ఉన్నంతవరకు అతను ప్రెసిడెంటుగాను, ప్రైమినిష్టరుగాను ఉంటాడు. మెలుకువ రాగానే ఏమీలేదు. నీవు అజ్ఞానమనే నిద్రలో ఉంటున్నావు.

**అద్వైత దర్శనం జ్ఞానం**

అజ్ఞానము దూరము కావాలంటే జ్ఞానము రావాలి. జ్ఞానమంటే ఏమిటి? 'అద్వైత దర్శనం జ్ఞానమ్'. అనేకమంది మానవులు భగవంతుని ఆశిస్తుంటారు, ఆరాధిస్తుంటారు, పూజిస్తుంటారు. ఇంత మాత్రమున భగవంతుడు మనకు లభ్యముకాడు. నీవు చింతించినంతవరకు నీవు వేరు, భగవంతుడు వేరు. మీరిరువురు ఒక్కటి కావాలి. ఏ

srisathyasaivahini

విధంగా? నిన్ను నీవు అర్పితము కావించగానే అతను, నీవు ఒక్కటే! I and you are one.

**పాలు, నీళ్లు ఏకమైపోయినట్లు భగవంతునిలో భక్తుడు ఏకమైపోవాలి**

'తత్త్వమసి', 'అహం బ్రహ్మాస్మి', ఈ స్థితికి రానంతవరకు భగవంతుడు భగవంతుడే, భక్తుడు భక్తుడే! నీవు నీవే! దేవుడు దేవుడే! నీవు, దేవుడు ఒక్కటి కావాలి అంటే, నీవు భగవంతునికి అర్పితము కావాలి. ఏ విధంగా? నీరు, చక్కెర ఒక్కటైనట్లు. రెండూ ఏకమై పోయాయి. చక్కెర వేరుగా లేదు. మానవత్వము దీనిని అర్థము చేసుకోలేదు. యింద్రియములు దీనిని అర్థము చేసుకోలేవు. ఒక చిన్న ఉదాహరణము. ఇది ఒక టంబ్లరు. దీనిలో పండ్లరసము వేసాము. టంబ్లరుకు పండ్లరసముయొక్క మాధుర్యము తెలీదు. దానిలో స్ట్రా పెట్టాము. స్ట్రాకుకూడా మాధుర్యము తెలీదు. నాలుకమీదకు వెళ్లినప్పుడు తెలుస్తుంది. శరీరమునకు మాధుర్యము యింద్రియములవలన తెలుస్తుంది. బుద్ధి అనే జిహ్వవలన తెలుస్తుంది. చైతన్యుడు చెప్పుతున్నాడు.

**జిహ్వే రసజ్ఞే మధుర ప్రియే త్వం**
**సత్యం హితం త్వాం పరమం వదామి**
**ఆవర్ణయేథా మధురాక్షరాణి**
**గోవింద దామోదర మాధవేతి.**

'ఓ మధురమైన నాలుకా! ప్రియమైన నాలుకా! నీవు సత్యమైన, పవిత్రమైన గోవిందనామాన్ని పలకాలి. హృదయమును నిర్మలంగా, నిశ్చయంగా, నిస్వార్థంగా ఉంచుకోవాలి'. ఈనాడు మానవుడు భగవంతుని తనకంటె భిన్నంగా భావిస్తున్నాడు. ఈ విధంగా ఎన్ని తరములు, జన్మములు ఎత్తినప్పటికిని తాను భగవంతునిలో ఐక్యము కాలేదు. పాలలో నీరు ఏకమైనట్టు భగవంతునిలో భక్తుడు ఏకమైపోవాలి. ఎట్టి తపములు చేయనక్కరలేదు, ఎట్టి వ్రతములు చేయనక్కరలేదు. ఎట్టి ధ్యానములు చేయనక్కరలేదు. కేవలము ప్రేమతోనే సాధించగలరు. ఇట్టి ప్రేమతత్త్వాన్ని బోధించినటువంటిదే వేదాంతము. 'రసోవైసః' అని బోధించింది. భగవంతుడు రసస్వరూపుడే! నీవూ రసస్వరూపుడవే! అదియే ఆత్మతత్త్వము. ఈ రసత్వము స్వీకరించడానికి ప్రారంభించేటప్పటికి అభిమానము,

sri sathyasai vachanamrutam

అహంకారము రెండుకూడను అడ్డుకుంటాయి.

**అహంకార, మమకారములుండినంతవరకు సర్వసంగపరిత్యాగి కాలేడు**

అదిశంకరులవారికి, మండనమిశ్రునకు వేదాంతమునందు వాదోపవాదము జరిగింది. వారిలో ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడిపోతారు అని నిర్ణయించడానికి ఒక న్యాయనిర్ణేత కావాలి. ఎవరు నిర్ణయిస్తారు? శంకరులవారు మండనమిశ్రునకు 'నీ భార్యయగు ఉభయభారతి న్యాయనిర్ణేతగా ఉండమ'న్నాడు. చూశారా, శంకరులవారి నిర్ణయము! ఉభయభారతి మండనమిశ్రునకు భార్యయైనప్పటికి ఆమెనే న్యాయనిర్ణేతగా నియమించాడు. ఎందుకంటే, ఆమెది భేదరహితమైన బుద్ధి. ఆమెకు నాది, నీది అని భిన్నాభిప్రాయములేదు. ఆమెకు తెలుసు; భర్త అయినప్పటికి 'ఏకంసత్ విప్రాః బహుధా వదంతి'. ఉన్నది ఒక్కటే సత్యము. అట్టి సత్యమునే గుర్తించినది, నమ్ముకున్నది, ఉభయభారతి. కాబట్టి ఆమెనే న్యాయనిర్ణేతగా పెట్టుకుందాము, అన్నాడు శంకరులవారు. ఇద్దరూ వాదించారు. కడపటికి మండనమిశ్రుడు వాదములో ఓడిపోయాడు. ఈ సత్యాన్ని ఏమాత్రము సంకోచించకుండా, ఏమాత్రం భయము లేకుండా, నిర్భయంగా 'మండనమిశ్రుడు ఓడిపోయాడు' అని చెప్పింది, ఉభయభారతి. ఆ వెనువెంటనే సత్యాన్ని నిలబెట్టడంకోసం, తన మాటను నిలబెట్టడంకోసం మండనమిశ్రుడు సన్యాసము తీసుకున్నాడు. తన అర్ధాంగి అయిన ఉభయభారతికూడా సన్యాసము తీసుకున్నది. ప్రాకృతమైనవి అంతా ఒకవైపున, పరతత్త్వము మరొకవైపున. ఇది ప్రవృత్తి, అది నివృత్తి. ప్రవృత్తి, నివృత్తిల సంబంధము అవినాభావసంబంధము అని నిరూపించింది, ఉభయభారతి. రెండింటియందు reaction, reflection, resound ఛాయమాదిరి గుర్తించుకుంటూ వచ్చింది. ఎప్పుడు తన భర్త, తాను సన్యాసాశ్రమము తీసుకున్నారో అప్పుడే 'నేను వేరు, తాను వేరు', అని భావించి ఉభయభారతి ఒక ఆశ్రమము నిర్మించుకున్నది, తనకొరకు. ఆ భార్యాభర్తలు యిద్దరు వేరు వేరు అయిపోయారు. ఉభయభారతి తన ఆశ్రమములో స్త్రీలను మాత్రమే చేర్చుకొని వారికి ఆత్మ ప్రబోధము సల్పుతున్నాది. ఒకరోజున కొంతమంది స్త్రీలతో కలసి తెల్లవారుఝామున గంగానదికి

srisathyasaivachanamrutam

స్నానమునకు వెడుతున్నది. దారిలో ఒక సన్యాసి ఎదురైనాడు ఆమెకు. అతనిది నిజమైన సన్యాసము కాదు. కేవలము వస్త్రసన్యాసము. బట్టలు మార్చుకున్నాడేగానీ బుద్ధులు మార్చుకోలేదు. గుడ్డలు మార్చుకున్నాడేగానీ గుణములు మారలేదు. ఆ వ్యక్తి నిత్యము తాను నీరు త్రాగే నిమిత్తము ఒక ఎండిపోయిన సొరకాయను వాడుకునేవాడు. దీనిని ప్రక్కన పెట్టుకుంటే ఎవరైనా ఎత్తుకు పోతారని తలక్రింద పెట్టుకున్నాడు! అతనికి సరైన వైరాగ్యము ప్రబోధించాలని సంకల్పించి ఉభయభారతి తనవెంట వస్తున్న స్త్రీలతో గట్టిగ చెప్పింది: 'చూడండి, అతను విరాగి. కానీ, తన సొరకాయ ఎవరైనా దొంగిలిస్తారో యేమోనని దానిపై అభిమానము పెట్టుకున్నాడు, పాపం! నిరుపయోగమైన, తుచ్ఛమైన ఈ చిన్న వస్తువును వదలలేకపోతున్నాడు పాపం! తలక్రిందపెట్టుకొని పడుకున్నాడు'. ఆ మాటలు విన్నాడు, ఈ విరాగి. 'ఛీ' నన్ను ఈ విధంగా అవమానము చేసింది కదా అని ఒక వైపు కోపం వచ్చింది. ఉభయభారతి స్నానము చేసి తిరిగి వెనుకకు వస్తున్నది. అది కనిపెట్టి ఈ సొరకాయను తీసి ఆమె ముందు పారవేశాడు. అప్పుడు ఉభయభారతి 'అయ్యో! అభిమానమే అనుకున్నాను, అహంకారముకూడా ఉంటున్నాదే యితనికి! లేకపోతే యిది విసిరి నాకాళ్లపై పడవేస్తాడా?' అనుకుంది. అప్పుడు ఆమె కొద్ది నిముషములు నిల్చి 'సన్యాసీ! నీకు అభిమానముతోబాటు అహంకారముకూడా పెరిగిపోతున్నాది. మంచిదికాదు. నీవు వేసుకున్న గుడ్డలకైనా గౌరవమునందించు. ఈ అహంకార, మమకారములుండినంతవరకు నీవు సర్వసంగ పరిత్యాగివి కాలేవు. దేహాభిమానము దూరముచేసి ఆత్మాభిమానములో ప్రవేశించు' అని మధురమైన, శాంతమైన చక్కని భావముతో ప్రబోధించింది. జ్ఞానమునకు స్త్రీపురుషభేదమెక్కడుంది? దేహమునకు స్త్రీలు, పురుషులు.

**జ్ఞానమునకు ప్రకృతి భేదములు లేవు**

కానీ జ్ఞానమునకు లింగ భేదము లేదు. ఏ జాతి భేదము లేదు. ఏ వర్ణభేదము లేదు. ఏ ప్రకృతిభేదములు లేవు. పరిగెత్తి వచ్చి ఆమె పాదములపై పడ్డాడు, ఈ సన్యాసి. 'అమ్మా! ఎవరూ ఈ సత్యమును బోధించే వ్యక్తులు లేకపోవటంచేత యీ విధంగా సన్యాసులు నటనచేస్తూపోతున్నారు. నేటినుండి ఉభయభారతే నా గురువు' అని నమస్కరించాడు. ఈ

srisathyasai vahini amrutam

విధంగా మానవత్వములో ఎన్ని విధములైన సాధనలో చేసినట్టు కనిపిస్తుంటారు.

**కాషాయ వస్త్రమువేసినగానీ, కంఠమాలనె**
**గడగడ జపమాలగ త్రిప్పినా కడకు నీ వద్దకు రావలె బాబా**
**దయచేత ధన్యులు కావలెరా!**
**ఎంతటివారైనా దయచేత ధన్యులు కావలెరా**

ఏమి ప్రయోజనము? ప్రాకృతింగా మనం చేస్తున్నామేగానీ, జపములు ధ్యానములు దయకు సమీపమయ్యే స్థితిని మనం పొందగలుగుతున్నామా? భగవంతుని ప్రేమకు పాత్రులమయ్యే మార్గము వెతుకుతున్నామా? ఈ సత్యము తమకు తాము చక్కగా విచారించుకున్నప్పుడు సత్యము మనకు తక్షణమే బయటపడుతుంది.

**భగవంతుడొక్కడే నిజమైన స్నేహితుడు**

ఈనాటి ప్రజలందరు అనేక రకముల సాధనలు చేస్తున్నారు. దీనికి మొట్టమొదట స్నేహము కావాలి. ఎవరితో స్నేహము కావాలి? మారనటువంటివానితో స్నేహము కావాలి. అదే అమృతస్వరూపుడైన దైవత్వము. చూడండి నవవిధమార్గములలు గురించి మీరు ఎన్నో పర్యాయములు విన్నారు.

**శ్రవణం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం**

స్నేహము అయిన తరువాతనే ఆత్మనివేదన. మొట్టమొదట భగవంతునితో స్నేహం కావాలి. ఈ లోకములో ఉండినవారంతా నిజమైన స్నేహితులు కానే కాదు. హలో how are you, how are you, good bye, good bye అంతే! ఇదికాదు, స్నేహము. చెరువులో నీరుండినంతవరకు కప్పలుంటాయి. తరువాత కప్ప ఒక్కటీ ఉండదు. జేబులో డబ్బు, father position గట్టిగా ఉంటే అంతవరకు స్నేహితులు ఉంటారు. తరువాత ఎవరూ good bye కూడా చెప్పరు. లండన్‌లో Cromwell అని ఒక పెద్ద రాజకీయ నాయకుడు ఉండేవాడు. కట్టకడపటికి అతనిలో ఏదో దోషము ఏర్పడిపోయింది. అతనికి ఉరిశిక్ష

sri sathyasai vahini amrutam

పడింది. అతడు పక్కా పొలిటీషియన్! కోట్ల పౌండ్లు ఖర్చు పెట్టాడు. స్నేహితులకు ఎంతో ధనము యిచ్చాడు. ఇల్లు, యిల్లు ప్రదక్షిణ చేశాడు. ఎంతో ధనము ధారపోసాడు. కట్టకడపటికి మెడకు ఉరి బిగించే సమయంలో తనలో తాను స్మరించుకుంటూ వచ్చాడు: 'ఈ ధనమును నేను ఎంత దుర్వినియోగము చేశాను! నా పవిత్రమైన కాలమునెంత దుర్వినియోగము చేశాను! నా కాయమును, నా కాలమును, నా కర్మను సర్వము వ్యర్థము చేసుకున్నాను. ఇదియే భగవంతునికి అర్పితము చేసి ఉంటే ఎంత ఆనందించేవాడనో! ఎంత ఉత్తమస్థితి పొందేవాడనో! ఇంత ఖర్చు పెట్టి, యింత చేసిన నాకు ఈ దుర్గతియా! ఛీ! ఎన్ని జన్మములెత్తినా ఇక ఈ రాజకీయములలో ప్రవేశించనని promise చేశాడు. ఎప్పుడు ఆ ప్రోమిస్ చేశాడో అప్పుడు ప్రభుత్వముకూడా కన్నులు తెరచింది. తక్షణమే ఉరిశిక్ష cancel అయింది. అప్పుడాయన భగవంతుని తలంచి 'ఓ భగవంతుడా! నీకు సేవచేయని ఈ హస్తము లెందుకు? అనుకున్నాడు.

**దేహములో సర్వాంగములు సార్థకము గావించుకునే నిమిత్తమై అనుగ్రహింపబడినవే!**

దీనినే తుకారాం చెప్పాడు 'రామా! నేను అంగహీనుడను' అని ప్రార్థించాడు. ప్రక్కనున్న శిష్యులందరు 'ఏమిటి, ఈయన పిచ్చివాడై పోతున్నాడు? అన్ని అంగములుంటున్నాయికదా! అంగహీనుడని ఎందుకు చెప్పుకుంటున్నాడు?' అని ఆశ్చర్యపోయారు. తుకారాం 'చేతులున్నాయికానీ నీ సేవలు చేయలేకపోతున్నాను. యిది అంగహీనముకదా! ఉండి ప్రయోజనం ఏమిటి? కన్నులు ఉన్నాయి కానీ నిన్ను చూడలేకపోతున్నాను. ఈ కన్నులు ఎందుకోసమని! కేవలం పత్తికాయలవలె ఉంటున్నాయి కన్నులు. చెవులున్నాయి. నీ వేణుగానాన్ని వినలేకపోతున్నాను. నీ మధురమైన వాక్యములు శ్రవణం చేయలేకపోతున్నాను. కుక్కలు, నక్కలుదూరే caves మాదిరి ఉంటున్నాయి యీ చెవులు. కాళ్లు ఉంటున్నాయి. కానీ నీ దగ్గరకు వచ్చి నమస్కరించలేకపోతున్నాను. బజారు, బజారు తిరుగుతున్నాను', అని వాపోయాడు.

**పొద్దుపోక ఊరివారి సుద్దులంటే**
**మీరు సిద్ధమౌదురే కడు శ్రద్ధతోడ**

**ముద్దుముద్దుగాను భగవత్ ముచ్చటల్**
**చెప్పువేళ ఒద్దికనుండరే ఓ చెవులారా!**
**పనిలేని శునకమువలె పరుగిడి**
**వగర్చుచు తిరుగుదురే**
**క్షణమైన దైవసన్నిధి నిలువగ**
**కడు కష్టమా ఓ పాదములా!**

ఏమి ప్రయోజనం, ఈ అంగములంతా ఉండి? నీ సేవకు యివి ఉపయోగించాలి. దీనినే సూరదాసుకూడ చెప్పాడు:

**కన్నులుండి గ్రుడ్డులై కళ్యాణకరమైన**
**నీ మూర్తి దర్శింపనేరరైరి.**

ఓ భగవంతుడా! నాకు కన్నులిస్తానని అంటున్నావా? నాకు కన్నులక్కరలేదు. ఎంతమందికి కన్నులు లేవు? వారంతా నిన్ను చూచారా?

**చెవులుండి చెవుటులై అతి మనోహరమైన**
**నీగానమాలింప నేరరైరి.**

నీ హృదయములోనే ఉంటున్నాడు పరమాత్ముడు. అతన్ని వదలిపెడుతున్నావు. ఎక్కడో బజారులో తిరిగి అన్ని విధాలా సంసారములో ప్రవేశిస్తున్నావు.

**కన్నులనిచ్చిన దెందుకోతెలుసా?**
**అందముచూచేటందులకా!**

దీనినే పురందరదాసుకూడా చెప్పాడు.

**కన్నులేలరా! రాముని చూడని కన్నులేలరా**
**కన్నులేలరా! కంటి చూపులేలరా! రామా!**

దేహములో సర్వాంగములు సార్థకము గావించుకునే నిమిత్తమై అనుగ్రహించినవే గానీ

srisathyasai vachanamrutam

పెడమార్గము పట్టించటానికి గానీ, తప్పుమార్గములో ప్రవేశించటానికిగానీ కాదు. ఆ సత్యమును గుర్తించి వర్తించటమే నిజమైన మానవత్వము. తానే చూచుకుంటాడు సర్వము. 'ఎప్పుడూ 'రాంరాంరాం' అని జపముచేస్తే నా పొట్టను నింపేది ఎవరయ్యా', అంటారు కొంతమంది. 'నా జీవితము జరగాలికదా' అంటారు. నారు పెట్టినవాడు నీరు పోయడా! నిజముగా హృదయపూర్వకంగా స్మరిస్తుంటే తాను నిన్ను చూచుకోలేడా? యింత బ్రహ్మాండము చూచుకునేవానికి ఒక్కవ్యక్తి బరువు అవుతాడా? అంతా తానే చూచుకుంటాడు. రాతిపైన పుట్టింది చెట్టు. వేరులన్నీ రాళ్లపైనే ఉన్నాయి. దానికి కట్టకట్టి నీరుపోసి ఎరువు వేసినవారు ఎవరు? దైవమే దాన్ని పెంచాడు. రాయి ఉంటున్నాది. రాయిని కొట్టినప్పుడు దానినుండి ఒక కప్ప వచ్చింది బయటకు. ఆ రాతిలో ఉండిన కప్పకు ఆహారాన్ని ఎవరు పెట్టారు? నీ తాత పెట్టాడా? నీ నాన్న పెట్టాడా?

**భగవంతుడే అన్నీ చేస్తున్నాడు!**

భగవంతుడే అన్నీ చేస్తున్నాడు. నెమలికి ఎంత చక్కని వర్ణములు పూసాడు! ఈ రంగులు ఎవరు వేశారు? ఎంత గొప్ప పెయింటరు వేసినా నెమలి original రంగులు అక్కడ రావు. అక్కడ artificial రంగులు వస్తాయిగానీ heartful వి రావు. పచ్చని చిలుకకు ఎఱ్ఱని ముక్కు పెట్టాడు. ఎవరు పెట్టాడు? నిజముగా భగవత్ సృష్టిలోని రహస్యాలు ఎంత గొప్పవి! గుడ్డులో పిట్ట ఉంది. విత్తనములో వృక్షము వుంటున్నాది. మనిషిలో మనిషి ఉంటున్నాడు. ఇది ఎవరు నిర్మించినది? ఏ యింజనీరు ప్లాను? ఏమీకాదు. ఇవన్నీ దైవముయొక్క నిర్ణయాలే! అలాంటి పవిత్రమైన దైవశక్తిని అర్థము చేసుకొనలేక తుచ్ఛమైన, అల్పమైన మానవత్వమునే ఘనముగా వర్ణించుకుంటున్నాం మనము. 'కొండలు కొండలే మోసిన హనుమంతునికి గులకరాళ్ళెంత', అన్నారు. ఒక చిన్న ఉదాహరణము. రామలక్ష్మణులు యిరువురు రామేశ్వరం వెడుతున్నారు. రామేశ్వరం వెళ్లే సమయంలో రామలింగేశ్వరుని ప్రతిష్ఠించాలని సంకల్పించుకున్నారు. ఏదో ఒక రీతిలో జగత్తంతా నామస్మరణ చేయాలని రామలింగేశ్వరములో లింగమును ప్రతిష్ఠించాలని తలచాడు. హనుమంతునికి రామా అంటే తప్ప యింకేమీ యిష్టములేదు. 'ఎద్దునెక్కినా గద్దనెక్కినా యిద్దరొక్కటే ఓరన్నా' ఈ

sri sathyasai vahini / vechanamrutam

సత్యమును రాముడు ఎప్పుడూ బోధిస్తూవచ్చాడు. రాములంటే ఉన్న ప్రేమ యింకో దానిపై లేదతనికి. హనుమంతునే పంపాడు. ఎవరు వద్దంటున్నారో వారిచేతనే ఆ పని చేయిస్తాడు! 'హనుమా! నీవు ఫలాని పర్వతముపైకి వెళ్లి ఒక లింగము తీసుకొనిరా. ప్రతిష్ఠ చేయాల'న్నాడు. అతనికి అంత interest లేదు. అతను ఉత్సాహము చూపించలేదు. 'ఫలాని టైములోపలనే చేయాలి. తక్షణమే తీసుకొనిరా', అన్నాడు. వెళ్లాడు, తీసుకొని వచ్చాడు.

## శ్రద్ధ ఉన్నచోటనే జ్ఞానముంటుంది

ఎక్కడ శ్రద్ధ ఉంటుందో అక్కడనే జ్ఞానం ఉంటుంది. శ్రద్ధ లేనప్పుడు జ్ఞానముకూడా పని చేయదు. రాముడు చెప్పిన కాలమునకు 10 ని॥లకు ఆలస్యంగా వచ్చాడు. రాముడు ఆలోపలనే యిసుకలింగము తయారుచేసి ప్రతిష్ఠ చేశాడు. 10 నిముషములు ఆలస్యమైందని ఆ లింగము వద్దన్నాడు. హనుమంతునికి బాగా కోపం వచ్చింది. నేను యింత కష్టపడి తెచ్చిన లింగము వద్దని అంటున్నాడు అని బాధ పడినాడు. అప్పుడే రామునిపై కోపం వచ్చింది. 'ఏమిటి? నాలో భక్తి తక్కువా లేక నీలో శక్తిలేదా?' త్యాగరాజుకూడా వర్ణించాడు. రెండింటిలో ఏదో ఒకటి నిజం కావాలి. నిర్ణయమయ్యేవరకు మనస్సు శాంతించదు. కూర్చున్నాడు. నాలో భక్తి ఉన్నది. ఒక్కొక్క వెంట్రుకను పెరికాడు, చూచాడు. ఒక్కొక్క వెంట్రుక 'రాంరాం' అని రోమరోమము రామనామము పలికింది. నాలో భక్తి ఉందని తనకు తానే సంతృప్తి పడ్డాడు. 'రామునిలో శక్తిలేదు, నాలో భక్తి ఉంది' అని తృప్తి పడ్డాడు. భక్తిలోకూడా ఒక విధమైన అహంకారము ప్రారంభమవుతుంది. మళ్ళీ యోచన చేశాడు. ఎంత పొరపాటు! 'భగవంతునిలో శక్తి లేకపోతే యింతటి సముద్రము దాటి ఉండేవాడనా? నేను యింతటి ఘనకార్యము చేసి ఉండేవాడను కాదు' అని నిర్ణయించుకున్నాడు. దానిని పురస్కరించుకొనే త్యాగరాజు

**కపివారధిదాటునా కలికి రోటగట్టునా**
**లక్ష్మిదేవి వలచునా లక్ష్మణుండు కొలచునా**
**సూక్ష్మబుద్ధి కల భరతుడు చూచి మ్రొక్కునా**

అని తనకు తానే సమాధానపడ్డాడు. ప్రపంచమంతా లక్ష్మీదేవిని ప్రార్థిస్తున్నాది, 'ఏ

srisathyasaivachanamrutam

మానవుడు చూచినా ఓ లక్ష్మీ! లక్ష్మిని ప్రసాదించ'మని. ప్రపంచమంతా ఆరాధనచేస్తున్న ఆ లక్ష్మి నిన్ను వరించాలంటే ఎంత గొప్పతనమున్నాది నీలో! వీరందరు సామాన్యముగా ఉన్నారా? భరతుడు ఎంత సూక్ష్మబుద్ధిగలవాడు! త్యాగరాజుకూడా అంటున్నాడు: 'ఏమీలేకపోతే ఎందుకింతమంది కొలుస్తారు? కనుక ఓ రామా! నీ శక్తి ఎంతో గొప్పది!' మేము ఎవరికి ఏ invitation పంపటంలేదు. ఈ శక్తియే, ఆ magnet, ఆ దివ్యత్వమే, ఆ పవిత్రమే, ఆ దైవత్వమే అన్నింటిని ఆకర్షిస్తుంది. హనుమంతుడు తెచ్చాడు. ప్రతిష్ఠ అయిపోయింది. తిరిగి వస్తున్నారు.

### 'ఎద్దునెక్కినా గద్దనెక్కినా ఇద్దరూ ఒక్కటే!

శ్రీరాముడు హనుమంతుని పరీక్ష చేసినప్పుడే అతనికి ఆనందము. వస్తూ వస్తూ కాలికి ఏదో తగిలి క్రిందపడినట్లుగా పడ్డాడు రాముడు. అక్కడ ఒక చిన్న రాయి తగులుకొని క్రింద పడ్డట్టు నటించాడు. వెనకనే ఉంటున్నాడు లక్ష్మణుడు. అన్నా! ఏమిటదని ప్రశ్నించాడు. ఏమీలేదు. చిన్న రాయి అన్నాడు. హనుమంతుడు వచ్చాడు. ఈ దారిలో యింకెవరైనా నడుస్తే వారికి తొందర అవుతుంది అని యీ రాయిని పెరికి పారేస్తాను అన్నాడు. 'హనుమంతా! కొండలు మోసినవానికి యీ గులకరాయి నీకెంత? విడిచిపెట్టు, దాని జోలికి నీవు పోవద్దు. యింకొక పర్యాయము నేను జాగ్రత్తగానే వస్తాను. రాతిదోషంకాదు' అన్నాడు, రాముడు. లేదు, దీనిని తీసి వేయాలని పట్టుపట్టాడు హనుమంతుడు. అది జన్మవాసన. పెట్టిందిపేరు, కోతికి చంచలత్వమునకు. ఎడమచేతితో తీసివేయుటకు ప్రయత్నించాడు. కదలలేదు. తరువాత రెండు చేతులతో పట్టాడు. కదలలేదు. తన శక్తినంతా ఉపయోగపెట్టాడు. కించిత్తైనా అది కదలలేదు. హనుమంతుడు చాలా ఆశ్చర్యపడ్డాడు. 'రామా! ఏమి నీయొక్క లీలలు! అప్పుడు ఏమీలేదు హనుమా! నీవు శ్రమ పడనక్కరలేదని రాములే తన కాలి చిటికిన వేలుతో అట్లా అన్నాడు. ఎగిరి పడిపోయింది, రాయి. ఏమది? ఆనాడు హనుమంతుడు ప్రతిష్ఠకు తెచ్చి పారవేసిన లింగము. ఆ లింగమునుంచి జ్యోతి వచ్చి రామునితో చేరిపోయింది. రాములనుంచి జ్యోతిపోయి లింగములో చేరిపోయింది. రెండూ ఒక్కటే! ఎద్దునెక్కినవాడు లింగడు. గద్దనెక్కినవాడు

srisathyasaivachanamrutam

రంగడు. 'ఎద్దునెక్కినా గద్దనెక్కినా యిద్దరొక్కడే ఓరన్నా!' యిద్దరు ఒక్కటే అనే సమత్వము యీనాటినుండి గుర్తించమని బోధించాడు. యిట్లనే లోకములో రాముడంటే కొంతమందికి యిష్టము, కృష్ణుడంటే కొంతమందికి యిష్టము, సాయిబాబా అంటే కొంతమందికి యిష్టము. ఎందుకీ భేదాలు? దైవము ఒక్కడే! 'ఏకంసత్-ఏకోహం బహుస్యాం' బర్ఫీ, మిఠాయి, పాలకోవా, ఎన్ని చేసినా చక్కెర ఒక్కటే! నీ టేస్టు కోసమని యిన్ని విధములైన రూపనామములు నీవు కల్పించుకుంటున్నావు. కానీ, దైవము ఒక్కడే! ఏకాత్మభావము అభివృద్ధి పరచుకున్నప్పుడు దైవముతో ఏకమైపోతావు.

**నిరంతరము దైవాన్ని చింతిస్తూ దైవత్వమునే పొందండి**

విద్యార్థులారా! దివ్యాత్మస్వరూపులారా! దైవము ఎక్కడో దూరంగా ఉన్నాడని ఎప్పుడూ భావించుకోకండి. అతనిని ఆరాధన చేస్తే ప్రత్యక్షమవుతాడనే పిచ్చి భావము వదలండి. 'అతను నేనే, నేనే అతను' అని గట్టి నమ్మకము పెట్టుకోండి. నిన్ను నీవు ఆ భగవంతునికి అర్పితం చేసుకో! సులభంగా చిటికలో సరిపోతుంది, అంతా! పెద్ద కసరత్తు చేయనక్కరలేదు. 5 yrs plan, 10 yrs plan చేయనక్కరలేదు. ఈ ప్లానులన్నీ వృథా. ఈ మాస్టరు ప్లానులకు నీవు ప్రయత్నం చేయవద్దు. మాస్టరత్వము అతనికి అర్పితము చేయి. అదియే నిజమైన తత్త్వము. God is the only master. జగత్తులో ఎవరూలేరు master. Head-master లు ఉన్నారు. Stationmaster లు ఉన్నారు. Postmaster లు ఉంటున్నారు. వారంతా master కాదు. ఒక్కడే master. అతనే గాడ్! దైవాన్ని నిరంతరము చింతిస్తూ ఆ దైవత్వమునే పొందండి. అదియే సత్యము. Truth is GOD. అదియే జ్ఞానము. అదియే దైవము. అనంతమైనవాడే గాడ్. ప్రతి నిత్యము అగోచరమైన, అప్రమేయమైన, అనంతమైన వేదాంతమును బోధిస్తుంటే కొంతవరకు చిన్న పిల్లలకు అరుచిగా ఉండవచ్చు. మానవులకు మానవ ఆదర్శమైన కథలు చెప్పినప్పుడే మానవత్వము దివ్యత్వములో ప్రవేశించటము సాధ్యమవుతుంది. రేపటినుండి మతస్థాపకులైన ఆదిశంకరులవారు, రామానుజులవారు, మధ్వాచార్యులవారు యిలాంటివారి విషయములను, వారి జీవిత చరిత్రలను, వారు సాధించిన పవిత్రమైన పరమార్థమును ఒకరి తరువాత ఒకరి గురించి

srisathyasaivachanamrutam

చెప్పదలచుకున్నాను. అదే విధముగా అనేకమంది మహాపురుషులు, యోగులు, ఋషులు యిలాంటి వారందరు ఉంటున్నారు. వశిష్ఠుని brother ఎవరూ అంటే మీకు తెలియదు. అగస్త్యుడు, వశిష్ఠుని brother. యిలాంటివారి చరిత్రలు కొంతవరకు తెలుసుకుంటే హృదయమును చక్కగా పవిత్రము చేసుకొని తద్వారా ఆ మార్గములో ప్రవేశించడానికి ప్రయత్నం చేయవచ్చు. ఒకేతూరి విద్యార్థులు అంత high standard కి పోవటానికి వీలుకాదు. కనుక, మహనీయుల చరిత్రలు కొంతవరకు అర్థము చేసుకొని ఆ మార్గములో ప్రవేశించి గమ్యము చేరుతారని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగమును విరమిస్తున్నాను.

**(తేదీ 05-09-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam